# 'ఎదిగిపోయిన' మనిషి

శివం

శ్రీనివాసరావు నాకు చాలా ఏళ్ళ నుంచీ తెలుసు. అతను మెడికల్ రిప్రజెంటెటివ్ అయినా చాలా బాగా కథలు రాసేవాడు. అందుకే అతనంటే నాకు ఎంతో గౌరవం కూడాను. అతను వున్నట్లుండి మెడికల్ లైనుని వదిలేసి ఒక మాస పత్రిక సంపాదకుడయ్యేడంటే ఆశ్చర్యపోవడమే కాకుండా ఆనందించేను కూడాను.విజయవాడనుంచి గుంటూరుకి అట్టే దూరం లేకపోవడం వల్ల ఆది వారాల్లో ఏంతోచక వకోసారి గుంటూరు వెళ్ళి మళ్లీ రాత్రికి విజయవాడకు వచ్చేసేవాడిని. గుంటూరులో వున్నంతసేపు మా యిద్దరికీ సాహిత్యం మీదే చర్చ నడుస్తూ వుండేది. అదిగో అటువంటి సమయం లోనే నాకు వైశంపాయనుడితో పరిచయం అయింది.

వైశంపాయనుడు ఎర్రగా, పీలగా వున్నాడు. మహా వుంటే యిరవయి ఏళ్ళు వుంటాయి. ఉదికిన బట్టలు వేసుకొని, స్టూలు మీద కూర్చుని, బల్లపైన వున్న పత్రికల కట్టలకు లేబిల్సు అంటించి, కట్టలపైన ఏజెంట్లు అడ్రెసులు నెమ్మదిగా వ్రాస్తున్నాడు.

నేను అంతకు ముందు రెండు మూడు సార్లు వచ్చినా అతను ఎప్పుడూ నా దృష్టిని ఆకర్షించ లేదు. నేను వచ్చినప్పుడు శ్రీనివాసరావు అతని చేతనే నాకు కాఫీలు, సిగరెట్లు తెప్పిస్తే అతను ఆఫీసు బోయ్ అని అనుకున్నాను. కాని ఆనాడు శ్రీనివాసరావు వైశంపాయనుడిని చూస్తూ, ఏమోయి వైసూ! ఈయనెవరో తెలుసా?'' అంటూ నన్ను చూపిస్తూ అడిగేడు.

''క్షమించాలి, తెలియదు సార్'' అన్నాడు వినయంగా, చేతిలోని పనిని క్షణం సేపు ఆపేసి.

''ఏమిటీ యీాయనే నువ్వెరగవా? పోనీ యీాయన రచనలన్నా చదివేవా?'' నొచ్చుకుంటూ శ్రీనివాసరావు అన్నాడు.

''మన పత్రికలో పడివుంటే తప్పకుండా చదివే వుంటానండి'' అన్నాడు వైశంపాయనుడు మళ్ళీ తన పని చేసుకుంటూ, ''ప్రూఫులు కూడా నువ్వే దిద్దుతున్నావుగా—చదవకుండా ఎట్లా వుంటావులే! ఈయన రంగనాథరావు గారు. ఈ సంచికలో 'ఆడది—అనిల్ కుమార్!' అనే కథ యీాయన రాసిందే!''

''అమ్మమ్మ! అది చూడక పోవడమేమిటి సార్? చాలా గొప్ప కథ సార్! మొదటి సంచికలోని కథ 'అమ్మాయిలూ—అంతర్యాలూ' కూడా వీరే రాసేరు కదా సార్! రెండూ రెండే! చాలా మంచి కథలు'' అన్నాడు వైశంపాయనుడు నా వంక ప్రశంసాపూర్వకంగా చూస్తూ.

ఏమనాలో తోచక 'థ్యాంక్యు' అనేసి, జేబులోని సిగరెట్ పెట్టెను బయటకు తీసేను.

''ఒరేయి రంగా! ఇతను వైశంపాయనుడు. మన ఆఫీసులో ఆఫీసుబాయి, ప్రూఫ్ రీడర్, గుమాస్తా—అన్నీ యితనే. సాహిత్యం అంటే మహా యిష్టం. కాగితం పైన అచ్చు కన్పిస్తే చాలు నమిలి మింగేస్తాడు.''

ఆ తర్వాత రెండు మూడుసార్లు గుంటూరు వెళ్ళినప్పుడు శ్రద్ధగా పనిచేస్తున్న వైశంపాయనుడ్ని చూసేను. అప్పుడు అతను యిస్త్రీ చేసిన బట్టలు వేసుకోడం చూసి మనస్సులో ఆనందించేను శ్రీనివాస రావు అతని జీతం పెంచి వుంటాడులే అనుకుని.

మరోసారి గుంటూరు పత్రికాఫీసుకి వెళ్ళినప్పుడు, వైశంపాయనుడి స్థానంలో మరో కొత్త కుర్రాడు కన్పించేడు. 'ఏమిటోయి సీనూ! మీ వైశంపాయనుడు ఏమయ్యేడు?' అడిగేను.

' వైశంపాయనుడికి జీతం చాలటంలేదన్నాడు. అంత కంటె యివ్వడం నావల్ల కాదన్నాను, మానేసాడు' చెప్పేడు శ్రీనివాసరావు.

'ఇవ్వలేకపోయేవా? బండెడు చాకిరీ చేస్తున్నాడు కదా, పాపం!'

''మా ప్రొప్రెయిటర్ యిస్తే నాదేం పోయింది? ఆయన యివ్వలేనన్నాడు. అయినా అతను చదివింది ఎనిమిదో క్లాసు. మేమిచ్చేది 150 రూపాయలు. ఇంగ్లీషు కరెస్పాండెన్సు చేసిపెడితే మరో వంద యివ్వచ్చును. అదంతా కూడా నేనే చేసుకోవాలి. సరే గాని, వచ్చే నెలకి కథ ఏమైనా పంపు, అవసరం'' అన్నాడు. అంతటితో వైశంపాయనుడి చర్చ అయి పోయింది. కాస్సేపు పిచ్చాపాటి మాట్లాడి నేను స్టేషన్‌కి వచ్చేస్తూండగా, వైశంపాయనుడు కన్పించి 'నమస్కారం సార్' అన్నాడు రెండు చేతులూ జోడించి.

''నమస్కారం! బాగున్నావా! ఏం చేస్తున్నావ్?'' అన్నాను.

''మీ దయవల్ల బాగానే వున్నాను సార్. ప్రస్తుతం సుచిత్ర అనే పక్ష పత్రికలో పనిచేస్తున్నాను. నెలకి 300 యిస్తున్నారు సార్.''

''చాలా బాగుంది'' అన్నాను సంతోషిస్తూ.

''తమరు మా పత్రికకు ఏదైనా కథ పంపండి. కథల సెలక్షన్ అంతా నాకే వదిలేసేరు ఎడిటర్ గారు. అందుచేత తమర్ని గట్టిగా అడగగల్గు తున్నాను. ప్రచురించిన ప్రతి కథకూ కూడా అంతో యింతో పారితోషికం కూడా యివ్వకల్గుతున్నాం'' అన్నాడు అతను.

''తప్పకుండా పంపించడానికి ప్రయత్నిస్తాను. మరి వుంటా'' అంటూ స్టేషన్‌కి వచ్చేసేను. ఆ తర్వాత నెలలో వైశంపాయనుడు చెప్పిన పక్ష పత్రికలో నా కథ అచ్చుకావడం నాకు 25 రూపాయిలు పారితోషికం రావడం కూడా జరిగింది. ఆ రోజుల్లో పాతిక రూపాయలు పారితోషికం అంటే కొంచెం ఎక్కువే. శ్రీనివాసరావు ఎప్పుడూ 15 రూపాయలకు మించి యివ్వలేదు.

తర్వాత చాలా నెలల వరకూ, నా పనుల వత్తిడి వల్ల నేను గుంటూరు వెళ్ళడం కుదరలేదు. కాని గుంటూరు నుంచి వచ్చే పత్రికలోనూ, మద్రాసు పత్రికల్లోనూ వైశంపాయనుడి కథలూ, సీరియల్సూ ప్రచురింపబడు•

తూవుండటం వాటిని చూసి సంతోషించడమూ జరిగింది.

రెండు మూడేళ్ళ తర్వాతననుకుంటాను శ్రీనివాసరావు వద్ద నుంచి వుత్తరం వచ్చింది. తను మద్రాసులో ప్రెస్సు వకటి కొని, ఒక మాస పత్రికను వెలువరించ



బోతున్నాననీ, నెల రోజుల్లో గుంటూరు నుంచి మకాం ఎత్తి వేస్తున్నాననీ వ్రాసేడు. మళ్ళీ ఎన్నాళ్ళకు చూడటం పడుతుందోనని ఒక ఆదివారం తీరిక చేసుకుని గుంటూరు వెళ్ళాను. ఆ రోజుల్లో శ్రీనివాసరావు తన ఆశలూ ఆశయాలూ గురించి చెబుతూ నన్ను వూదర గొట్టి వదలి పెట్టేడు. సాయంత్రం యిహ నేను అక్కడ నుంచి వచ్చెయ్యబోతూండగా, వైశంపాయనుడు అక్కడికి వచ్చేడు. అతనిని చూసి, ఆశ్చర్యపోయేను. ఈ మూడేళ్ళలోనూ అతను బాగా నునుపు తేలేడు. కాళ్ళకు కాన్పూరు చెప్పులు, ఒంటికి టెర్లిన్ షర్టు, కళ్ళకు ఖరీదైన ఫ్రేముతో కళ్ళజోడు!

''నమస్కారం సార్! నేను వైశంపాయనుడిని'' అన్నాడతను ఆశ్చర్యపోయిన నాతో.

''అవును, బాగా మారిపోయేరు'' అన్నాను.

''మారకేం చేస్తేడోయి. రెండు చేతులా కథలు నవలలూ, రాసి అవతల పారేస్తున్నాడు. పబ్లిషర్సు ఎడ్వాన్సిచ్చి మరీ పోతున్నారు'' అన్నాడు శ్రీనివాసరావు నవ్వుతూ.

''గురూ గారు అట్లాగే అంటారు! బాగున్నారా సార్?'' అడిగేను. ''ఓ! బాగానే వున్నాను. మరి గురూగారు మద్రాసు వెళ్తున్నారుట. నువ్వు వెళ్ళడం లేదా?'' అని అడిగేను, ఏదో ఒకటి అనాలని.

''గురూ గారికి నా మీద దయ రాలేదు. వచ్చిన నాడు తట్టా బుట్టా సర్దుకుని వెళ్ళిపోవడానికి నేను ఎప్పుడూ సిద్ధమే!'' అన్నాడు చిర్నవ్వుతో, గురూ గారి

వైపు తిరిగి ఓ నమస్కార బాణం పారేసి.

"ఎందుకులే? ఇక్కడేదో సహాయ సంపాదకుడి హోదాలో నెలకి 400 తెచ్చుకుంటున్నాడు. పైగా బోలెడు తీరిక వుండటం వల్ల ఏ వెల్తో గికి పారేసి మరో 500 వరకూ తెచ్చుకుంటున్నాడు. నేను యీ సున్నప్పిడతను మద్రాసు తీసుకెళ్ళి అంత డబ్బు ఎక్కడ యివ్వగలను? నా పరిస్థితి కాస్త బాగున్నాక అట్లాగే పిలిపిస్తా" అన్నాడు శ్రీనివాసరావు.

"ఆ మాత్రం దయవుంటే అదే చాలు" అంటూ శ్రీనివాసరావుకి మళ్ళీ వినయంగా వో నమస్కారం పెట్టి, 'ఏం సార్? అప్పుడే వెళ్ళిపోతున్నారా? అన్నాడు నాతో.

"అవును, రాత్రయినా కొంపకి చేరుకోకపోతే ఎట్లా? ఈ బండి పోతే మళ్ళీ రాత్రి 11 గంటల వరకూ యిక్కడే కూర్చోవాలి" అంటూ నేను శ్రీనివాసరావు వద్ద సెలవు తీసుకుని రోడ్డు మీదకు వచ్చేను.

"నడవండి సార్! నేనూ స్టేషన్ వైపే వస్తున్నాను" అంటూ నన్ను అనుసరించేడు వైశంపాయనుడు.

"మీ పత్రిక ఎట్లా వుంది? బాగా పోతోందా?" అడిగేను.

"బాగానే పోతోంది సార్. వచ్చిన చిక్కల్లా ప్రొప్రయిటర్‌గారు నెలనెలా ఖచ్చితంగా జీతం అంతా యివ్వరు. అందుచేతనే అడ్డమైన పత్రికలకూ, పబ్లిషర్లకూ వ్రాసి డబ్బులు సంపాదించుకోవలసి వస్తోంది. పైగా ధరలు చూసేరుగా ఎట్లా మండి పోతున్నాయో— ఎంతొచ్చినా వాలి ఏడవటం లేదు" అన్నాడు బాధపడిపోతూ.

"అదేమిటోయ్! ఒక్కడి పొట్టకు 400 చాలడం లేదా?" అన్నాను.

"ఒక్కడినయితే తిన్నా తినకపోయినా గడిపెయ్య వచ్చును సార్! ఊరుకోక యీ మధ్య పెళ్ళి ఒకటి ఏడిచేను, అప్పటి నుంచీ యీ యితోధిక 'సేవ'" అన్నాడు సిగ్గుతో మెలికలు తిరిగి.

"ఓ అట్లా చెప్పు. కంగ్రాచ్యులేషన్సు! ఏమైనా పిల్లలా?"

" అబ్బే! యింకా అటువంటిదేం లేదండి!"

"మంచిదే! జాగర్తపడు కాస్త! లంపటాలు ఎక్కువైతే జీవితం దుర్భరం అయిపోతుంది" అన్నాను హెచ్చరికగా.

"అదీ నిజమే నండి. ఏమీ అనుకోకపోతే కొంచెం కాఫీ తాగి వెళ్దాంరండి. ఇక్కడ చాలా బాగుంటుంది కాఫీ" అన్నాడు ఒక హోటల్ ముందు ఆగి. వాచీ చూసుకుంటున్న నన్ను చూసి, "ఇంకా అరగంట పైగా టైం వుంది సార్ బండికి, రండి. అయిదు నిముషాలు" అన్నాడు ప్రార్థనా పూర్వకంగా.

"సరే నడు" అంటూ కాఫీ హోటలు లోపలకు నడిచేను. అవసరం లేకపోయినా ఒక కుర్చీని తన 'కర్చీఫు'తో దులిపి, 'అట్లా కూర్చోండి, ఫేన్ గాలి బాగా తగుల్తుంది" అని "ఇక్కడ ఎప్పుడూ వేడివేడి యిడ్లీ వుంటాయి. చాలా బావుంటాయి. ఆర్డరివ్వ మంటారా?" అన్నాడు.

## అసహ్యాల తిరుగుబాటు

అక్షరాల అడవుల్లోంచి.. .. ..
వ్యాకరణాల కొమ్మల్లోంచి.. .. ..
తుంచబడ్డ ఆకు
గాలి పాదాల క్రింద అణచబడివుంది—

గాలికి నాగస్వరం వూదడం తెలుసు
గాలి భుజాలమీద నాగు నాట్యం
చేస్తుంది—

* * *

భూమ్మీద కుక్క పెట్టిన గ్రుడ్డును
వెన్నెల తిని
కవిత్వం వ్రాస్తుంది—

గాలికి కవిత్వం అంటే ప్రేమ
ప్రేమకు గాలంటే ప్రేమ
గాలికి ప్రేమకు ఆకు'ల'ంటేనే
అసహ్యం!

* * *

అసహ్యాల తిరుగుబాటు
రేపు జరగబోతుంది—
అడవుల్లోంచి ... ... ...
వ్యాకరణాల్లోంచి ... ... ...
ఆ'కుల' కదలికల్లోంచి ... ...

జనజ్వాల

"అబ్బే, వద్దు. కాఫీ చాలు" అన్నాను ఖంగారుగా.

"రామూ! రెండు బెస్టు కాఫీ! స్పెషల్‌గా చేసి తీసుకుని రావాలి" అన్నాడు అక్కడి కొచ్చి నిలబడిన సర్వరేశ్వరుడితో.

"అట్లాగే సార్! ఇప్పుడే" అంటూ సర్వర్ వెళ్ళి పోగానే, వైశంపాయనుడు నా వైపు తిరిగి, " తమరు నాకో సాయం చేసి పెట్టాలి" అన్నాడు.

"ఏమిటది?" అన్నాను, డబ్బా ఏమైనా అప్పు అడుగుతాడేమోనని భయపడిపోతూ!

"మరేం లేదు సార్. శ్రీనివాసరావు గారికి నా గురించి కొంచెం గట్టిగా రికమెండుచెయ్యాలి తమరు. తమ మాటంటే ఆయనకు గురి ఎక్కువ. ఎట్లాగో ఆయనకి మద్రాసులో మరి మనిషి అవసరం వుంటుంది తప్పకుండా. నా సంగతి తెల్సుగా తమకి— రాత్రింబగళ్ళు కష్టపడి పనిచేస్తాను."

"ఓస్ యింతే కదా! అయినా, అవసరం అయితే అతనే నిన్ను పిలిపిస్తానన్నాడు కదా!" అన్నాను.

"ఇటువంటి అవకాశం కోసం మద్రాసులో బోలెడు మంది కాసుకుని కూర్చుంటారు సార్! ఆయన మద్రాసు వెళ్తే ఆ అవకాశం మన వరకు రానివ్వరు సార్- అక్కడి జనం!" అన్నాడు ఆదుర్దాతో వైశంపాయనుడు.

"అయితే నన్నేంచెయ్యమంటావు?"

"తమరు విజయవాడ వెళ్ళగానే నా గురించి శ్రీనివాసరావు గారికి గట్టిగా సలహా యిస్తున్నట్లు రాయండి. జీతం ఎంత యిచ్చినా సర్దుకుని పోతాను, అవసరం అయితే కొంచెం అవస్థపడి అక్కడి పత్రికలకు కూడా ఎవ్వో సీరియల్ నవలలు అవీ యిచ్చుకుంటాను. డిటెక్టివ్ నవలలు రాస్తాను. తమరు మాత్రం నాకు యీ సహాయం చేసి పెట్టాలి. తమ మేలు ఎన్నటికీ మరచిపోను" అన్నాడు నా రెండు చేతులు పుచ్చుకుని.

"సరే, అట్లాగే రేపే రాస్తాను, కాని మద్రాసు వెళ్ళి నువ్వు ఫామిలీతో అవస్థపడి పోతావేమోనని నా భయం" అన్నాను.

"నేను అంతా బాగా ఆలోచించుకున్నాను సార్! అక్కడ వుంటే సినిమాలకి రాసే అవకాశాలు కూడా రావచ్చును" అన్నాడు.

అతని ఆలోచనలకి కొంచెం విస్తుపోయి పైకి మాత్రం నా ఆశ్చర్యాన్ని కన్పించనివ్వకుండా "సరేలే మరి వుంటాను" అంటూ బయటకొచ్చి స్టేషన్‌కి వెళ్ళి పోయేను.

అతనికి మాట యిచ్చినట్లే మర్నాడు శ్రీనివాసరావుకి ఒక ఉత్తరం వ్రాసి పడేసేను. శ్రీనివాసరావు వద్ద నుంచి గాని, వైశంపాయనుడి వద్ద నుంచి గాని, తర్వాత ఏవిధమైన కబురూ లేదు. నేనూ ఆ విషయం అంతటితో మరిచిపోయేను.

కొన్నాళ్ళ తర్వాత మద్రాసు నుంచి శ్రీనివాసరావు పెట్టిన కొత్త పత్రిక మొదటి సంచిక నాకు పోస్టులో వచ్చింది. పత్రిక నూతన శీర్షికలతో, మంచి మంచి కథలతో, వ్యాసాలతో చాలా బాగుంది. అందులో వైశంపాయనుడి కథ కూడా ఒకటి వుంది. అతని కథ చాలా చక్కగా వుండటం చూసి ఆనందించేను. పత్రికను గురించి అభినందిస్తూ శ్రీనివాసరావుకి ఓ లేఖ వ్రాసి పడవేసేను కూడాను.

ఒకటి రెండు సార్లు శ్రీనివాసరావే ఆ తర్వాత, పత్రికకు ఏదైనా కథను పంపించమని ముక్తసరిగా వ్రాయడం, నేను పని వత్తిడిలో వుండి ఏమీ వ్రాయలేక పోవడం జరిగింది.

అయిదేళ్ళ తర్వాత అనుకుంటాను మా బంధువుల యింట్లో వివాహం వుండి, కుటుంబ సమేతంగా మద్రాసు వెళ్ళవలసి వచ్చింది. పెళ్ళి హడావిడి అయిపోయేక వో పూట శ్రీనివాసరావు ప్రెస్సుకి వెళ్ళేను. ప్రెస్సు చాలా పెద్దదే. జాబ్ వర్కు చాలా

పుష్కలంగా వుండటం వలన, వాడికి వూపిరి తీసుకోడానికి కూడా వ్యవధి లేనట్లుంది. అంత హడావడిలోనూ నన్ను సాదరంగా ఆహ్వానించి కూర్చోమని, అక్కడి కుర్రవాడికి కాఫీ ఒకటి నాకోసం ఆర్డరిచ్చి, గోల్డు ఫ్లేక్ పాకెట్ నాముందుకి తోసి, "ఎప్పుడు రావడం?" అని మళ్ళీ పని హడావడిలో మునిగి పోయేడు. వచ్చే పోయే వాళ్లతో, వాళ్ళకి సమాధానాలు చెప్పడంతోను, డబ్బు వసూలు చేసుకోడంలోనూ నిమగ్నమయిపోయేడు శ్రీనివాసరావు.

నేను కాఫీని పూర్తిచేసి, సిగరెట్ పైన సిగరెట్ కాలుస్తూ బల్లపైన పడివున్న రక రకాల పత్రికలను తిరగేస్తూ కూర్చున్నాను. ఇంతలోనే ఆటో దిగి, చిన్న హేండ్ బ్యాగ్‌తో వైశంపాయనుడు లోపలికి వచ్చేడు. నన్ను చూడగానే విప్పారిన ముఖంతో "బాగున్నారా సార్? ఎప్పుడొచ్చేరు?" అంటూ నా ప్రక్కకొచ్చి నిలబడ్డాడు.

"ఇక్కడ మా బంధువుల పెళ్ళి వుండి మొన్నే వచ్చేను. ఇవ్వేళ కాస్త తీరిక చిక్కి యిట్లా వచ్చేను. కులాసాయేనా? ఎక్కడ పనిచేస్తున్నారు?" అన్నాడు మర్యాద పూర్వకంగా.

అతను గ్లాస్కో లాల్చీ, గ్లాస్కో పంచికట్టుకుని వున్నాడు. ఒత్తుగా క్రాప్, సైడ్ బర్న్సు... 'మాడరన్'గా వున్నాడు నా చూపులకి.

"ఇక్కడే పనిచేస్తున్నాను సార్! 'గురూ' గారితో బాటే అక్కడ్నుంచి వచ్చేసేను. మీ దయవల్ల హాయిగా జరిగి పోతోంది" అన్నాడు.

"సర్లేవోయి. ఇంతకూ వెళ్ళినపని ఏం చేసుకొచ్చేవు. సున్నపుపిడతలాగా తిరిగొచ్చేవా, లేకపోతే—" అన్నాడు శ్రీనివాసరావు కోపంగా.

"లేదుసార్, వసూలు చేసుకొచ్చేను. అయిదు వేలు" అంటూ హేండ్ బ్యాగ్‌ను శ్రీనివాసరావుకి వినయంగా అందించేడు వైశంపాయనుడు.


శ్రీనివాసరావు నోట్ల కట్లను లెక్క పెట్టుకుని, "సరే, నువ్వు ఆ ప్రక్కగదిలో కూర్చుని యీ ప్రూఫులు సరిచూడు. ఇవ్వేళ రెండు ఫారాలన్నా ఎక్కాలి."

"అట్లాగే సార్" అంటూ బల్ల మీద ప్రూఫులు చూడాల్సిన కాగితాల కట్టను పుచ్చుకుని త్వరత్వరగా ప్రక్క గదిలోకి వెళ్ళిపోయేడు వైశంపాయనుడు.

"ఒరేయ్ యీ యిడియట్‌ని రికమెండ్ చేసినందుకు నిన్ననాలి అసలు" అన్నాడు నా వంక మందహాసంతో చూస్తూన్న శ్రీనివాసరావు.

"ఇప్పుడేమయిందిరా, బాగానే పని చేస్తున్నాడుగా. నువ్వు చెప్పిన డబ్బును తీసుకొచ్చేడు కూడానుగా" అన్నాను సమర్థనగా.

"ఒరేయి నాయినా! వీడికి సినిమా జబ్బు పట్టుకుంది. అంతకంటె కీర్తి కండూతి అంటే సబబుగా వుంటుందేమో. పొద్దున్ననగా వెళ్ళినవాడు, సినిమా వాళ్ళ చుట్టూ నాలుగు ప్రదక్షిణలు చేసి, చివర్న నా పని చేసుకొచ్చాడు. వీడికి యింత జీతం యిస్తూ, వాడి పని



నా పనీ కూడా నేనే ఎక్కడ చేసుకునేదిరా!"

"డబ్బు చాలడం లేదేమో— ఏమైనా పిటీ కదా!" అన్నాను.

"చాలకపోవడం ఏమిట్రా నెలకి వెయ్యి రూపాయలు యిస్తున్నాను. పైగా యితర పత్రికలకి కథలూ కాకర కాయలూ రాసుకోనిస్తున్నాను. ఇదీ చాలక నెల జీతం ముందే వాడేసుకుని, నెల మొదట్లో కోసుకోవద్దని గోల పెడ్తాడు. నేను చెబుతున్నాగా, వీడికి అమాంతం గోపీచందో, ఆత్రేయో అయిపోవాలని వుంది. వంక దొరికితే చాలు ఆ సినిమా ఆఫీసుల వైపు పడిపోతాడు. చస్తున్నాననుకో వీడితో" అన్నాడు.

"పోనీలేరా! ఏదో వుడుకు రక్తం. ఆశలు ఏడిపిస్తూ వుంటాయి. నాలుగు రోజులు పోతే అతనికే జ్ఞానోదయం అవుతుంది" అని సర్ది చెప్పి, మరి కాస్సేపు పిచ్చాపాటి మాట్లాడి, వాడి దగ్గర సెలవు తీసుకొని ఆ మర్నాడే ఆ వూరినుంచి విజయవాడ వచ్చేసాను.

వైశంపాయనుడు ఎట్లా వున్నాడో, ఏం చేస్తున్నాడో మరి చాలా రోజుల వరకు నాకు ఆలోచించే అవకాశం లేక పోయింది. పత్రికలలో పుంఖాను పుంఖంగా రాస్తున్న అతని సీరియల్ నవలలను బట్టి బాగానే వున్నాడని అనుకునే వాణ్ణి.

కొన్నాళ్ళకు నేను విజయవాడ నుంచి హైదరాబాద్ ట్రాన్సఫర్ అయిరావడం వల్ల శ్రీనివాసరావు సంగతి కూడా అంతగా ఆలోచించే అవకాశం గాని, అవసరం గాని లేక పోయింది.

ఎవరో మాత్రం ఆ మధ్య మాట వరసకి శ్రీనివాసరావు పత్రికలు ఆపేసేడని, జాబ్ వర్క్ విపరీతంగా లాభకరంగా వున్నందువల్ల దానిపైనే ఎక్కువగా దృష్టి కేంద్రీకరించాడని చెబితే, 'మంచిదే' అనుకున్నాను.

ఒకనాడు ఆకస్మికంగా ఒక వ్యక్తి ఆఫీసులో నా సీట్ దగ్గరకొచ్చి 'హల్లో రంగా బాగున్నావా?" అంటు చెయ్యి చాపే సరికి విస్తుపోయి, క్షణంపాటు అల్లాగే వుండి పోయేను. "నేనోయి. వైశంపాయనుణ్ణి. అప్పుడే మర్చిపోయేవా?" అన్నాడు నేను అందించిన చేతిని గట్టిగా నొక్కి, ఆప్యాయంగా వూపుతూ.

"ఓ! మీరా?" అన్నాను ఆశ్చర్యంగా.

అతను ఖరీదైన సూట్ వేసుకుని వున్నాడు. మెళ్ళో టై కూడా వుంది. కళ్ళకు కూలింగ్ గ్లాసెస్, నోటిలో పైప్! నా కళ్ళను నేనే నమ్మలేకండా వున్నాను.

"ఏం అంత ఆశ్చర్యపడ్తున్నావు? రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా అని అన్నట్లు ఓ మంత్రి గారు మనపైన దయ దల్చేరు. అంతే! ఓ పెద్ద సంస్థలో పబ్లిసిటీ ఆఫీసర్ పోస్టు యిచ్చేరు. అందుకే యీ పటాటోపం అంతా" అంటూ అక్కడవున్న కుర్చీని లాక్కుని కూర్చున్నాడు.

"మరి ఎడ్యుకేషనల్ క్వాలిఫికేషన్స్ వగైరా?"


"అవన్నీ ఎవడిక్కావాలోయి. నాల్గింగ్లీషు ముక్కలు ధారళంగా మాట్లాడ్డం నేరుకున్నాలే ఆ మధ్య. బస్. అది చాలు. పని జరిగిపోతోంది. అన్నట్లు ఎట్లా వున్నావ్? శ్రీనివాసరావు దగ్గర్నుంచి వుత్తరాలు అవీ ఏమైనా వస్తున్నాయా? ఆ మధ్య పత్రికలు కూడా మూసేసి జాబ్ వర్క్ మీద పడ్డాడట. అతనికేంలే రాజా! ఈ మధ్య ఓ కారు కూడా కొన్నాడని విన్నాను."

"దానికేం గాని నువ్వు 'యీవూరొచ్చి ఎన్నాళ్ళయ్యింది."

"ఎంతోనా? నాలుగేళ్ళు. మావూరి ఎం.ఎల్.ఎ. మంత్రి అయ్యేడు. ఆయన బలవంతం వల్లే మద్రాసు జాబ్ వదిలేసి యిక్కడకొచ్చేసాను. ఇక్కడ మన మాటకి ఢోకా లేదనుకో.

మంత్రులతో నీకేవిధమైన పనికావలసినా నా చెవిని పడెయ్యి. అయిదు నిమిషాల్లో చేయించి పెడతాను. ఇదిగో నా ఎడ్రెసు కార్డు. " అంటూ ఓ ఐవరీ కార్డును నా చేతికిచ్చాడు. చాలా ఖరీదైన విజిటింగ్ కార్డు.

"బావుంది. నువ్వు ఇంత వాడవయినందుకు చాలా




సంతోషంగా వుంది. ఇంతకూ మా ఆఫీసులో ఏం పని పడింది?'' అడిగేను.

''ఏం లేదు, స్టేషనులో అడిగితే కోటా అయిపోయిందన్నారు. ఢిల్లీకి రెండు టిక్కెట్లు ఫస్టు క్లాసుకి ఎల్లుండికి కావాలి. మీకేదో ఎమర్జెన్సీ కోటా వుంటుందటగా... అందులోంచి ఇప్పించాలి. ఈ చిన్న చిన్న వాటికి మంత్రుల వరకు వెళ్ళడం ఇష్టంలేదు.''

''అట్లాగే, ఇంతాచేసి టిక్కెట్లు కొన్నావా? వాటి నంబర్లు ఏమిటి?''

''ఇవిగో, ఎట్లాగోలాగా పని అయ్యేట్లు చూడు. చాలా ముఖ్యమైన పనిమీద ఢిల్లీ వెళ్తున్నాను. ఒకటి నా పేరు మీద, మరోటి రాజశేఖర్.''

''సరే ఆ టిక్కెట్లు యిట్లా ఇయ్యి. నేను మా ఆఫీసర్‌తో మాట్లాడి, తగిన ఏర్పాట్లు చేయించుకుని వస్తాను. ఇక్కడే కూర్చో'' అంటూ చెప్పి ఆ టిక్కెట్లు తీసుకుని మా ఆఫీసర్ గారి దగ్గరకు వెళ్ళి ఆయనను బ్రతిమలాడి, దానికి సంబంధించిన ఆఫీసర్‌కి ఫోన్ చేయించి, ఆయన చేత ఫోన్‌లోనే 'ఒకే' అనిపించుకుని నా సీట్‌కు తిరిగి వచ్చేను.

నా ముఖం చూస్తూ ''సందేనా'' అన్నాడు వైశంపాయనుడు.

''ఆ, సందే. ఎల్లుండి తిన్నగా స్టేషన్‌కి వెళ్ళు. ఛార్టులో మీ పేరు, బెర్తులు వుంటాయి. గ్యారంటీ! మరేం భయపడకు'' అన్నాను గట్టిగా అభయమిస్తూ.

''థాంక్సు గురూ! నీకు చాలా శ్రమ యిచ్చేను. అన్నట్లు యీ పుస్తకం నేను కొత్తగా రాసింది. బడుగు జీవాల్ని గురించి రెండేళ్ళు రాత్రింబగళ్ళు రిసెర్చి చేసి రాసిన పుస్తకం. చదివి ఎట్లా వున్నదీ రాయినాకు. మర్చిపోకే? అన్నట్లు నీకేం పని కావలసివచ్చినా నిర్మొహమాటంగా నాకు ఫోన్ చెయ్యి. 'ఆల్‌వేస్ యట్ యువర్ సర్వీస్' ఓ.కే. వస్తాను'' అంటూ పుస్తకం నాకిచ్చి వెళ్ళిపోయేడు చకచకా!

పుస్తకం దాదాపు 150 పేజీలు వుంటుంది. అంతా అట్టడుగు వాళ్ళను గురించే! అక్కడక్కడ వాళ్ళ ఫోటోలు, రేఖా చిత్రాలు కూడా వున్నాయి. చాలా శ్రమపడి వ్రాసిన పుస్తకమేననిపించింది. ఆ పుస్తకాన్ని ఆ సాయంత్రం ఇంట్లో పడవేసాను. ఎందుకోగాని దానిని చదివే అవకాశమే రాలేదు నాకు మళ్ళీ.

ఒక నెల తర్వాత కాబోల్ను ఆ పుస్తకాన్ని గురించి ఒక పత్రికలో నాకు పరిచయం వున్న వ్యక్తే రివ్యూ వ్రాసేడు. పుస్తకాన్ని ఆకాశానికి ఎత్తి వేస్తూ చాలా ఘనంగా శ్లాఘించేడా విమర్శకుడు. తర్వాత వరసగా పత్రికలన్నీ చాలా గొప్పగా పొగడ్తూ వ్రాసేసేయి ఆ పుస్తకాన్ని. వుండ బట్టలేక ఒక రాత్రి ఆ పుస్తకాన్ని చివరంటూ చదివేను ఆసక్తితో. రచనలో గొప్ప తెలివి తేటలు ఏమీ కనబడలేదు. అయితే బడుగు జీవుల వెనకపడి, వాళ్ళను లాలించో బెల్లించో, వాళ్ల జీవిత వివరాలను వెలికిలాగి అచ్చులోకి ఎక్కించేడు రచయిత. వాళ్ళ బాధలను క్లుప్తంగా వర్ణించేడు. యాభయి పేజీలు చదివేసరికి బోర్ అనిపించింది. అయినా ఓపికగా పూర్తి చేసి అవతల పడవేసేను.

ఒకనాడు ఆకస్మికంగా ఒక ఆహ్వానం అందింది. అందులో రచయిత వైశంపాయనుడికి అదేదో సాంస్కృతిక సంస్థ సన్మానం జరుపుతోందనీ, ఎవరో అమాత్యవర్యులు అధ్యక్షత వహిస్తారనీ వుంది. కారణాంతరాల వల్ల ఆ సన్మానసభకు నేను హాజరు కాలేకపోయినా, మిత్రుడికి సన్మానం జరుగుతున్నందుకు చాలా సంతోషించేను.

ఉన్నట్లుండి ఒక ఆంగ్ల వార పత్రికలో వైశంపాయనుడి చిత్రంవేసి, అతనిని గురించి, అతని రచనల గురించి బ్రహ్మాండంగా కీర్తిస్తూ ఒక పెద్ద వ్యాసం ప్రచురించబడింది—మరసటి నెలలో.

దేశంలో అనేక మంది రచయితలు ఎంతో చక్కగా, యింత కంటె గొప్పగా వ్రాస్తున్నా, వారికి లేని ప్రచారం మన వైశంపాయనుడికి ఎందుకా అని నా మనస్సులోనే అనుకున్నాను. కాని ఆ విషయం గురించి అట్టే ఆలోచించలేదు... మిత్రుడు కదా అని.

ఓ రోజు పొద్దున్నే మా శ్రీమతి కాఫీ కప్పును బల్లపైన వుంచుతూ, ''ఇది విన్నారా! మీ స్నేహితుడికి అదేదో సంస్థ 1,116 రూపాయిలు బహుమానం యిచ్చింది'' అన్నది.

''ఎవరోయి— అంత బహుమతికి నోచుకోగల్గిన స్నేహితులు నాకు ఎవరూ లేరే? అయినా ఏమిటా బహుమతి? దేనికా బహుమతి? ఎవరా అదృష్టవంతుడు? అయినా పొద్దున్నే నీకీవార్త ఏ కాకి మోసుకొచ్చింది?'' అని ప్రశ్నల వర్షం కురిపించేను.

''కాకీ లేదు, కొంగా లేదు. ఆకాశవాణి వార్తల్లో చెప్పేరు. మీ స్నేహితుడు వైశంపాయనుడు గారికి అదేదో పుస్తకం రాసినందుకు 1,116 బహుమతి వచ్చిందట! ఎందుకూ మీరు రాస్తున్నారు 20 ఏళ్ళనుంచి'' అంటూ లోపలికి వెళ్ళిపోయింది నా ఆగ్రహానికి జడిసి.

మరి కాస్సేపట్లో దినపత్రిక వచ్చి పడింది. వైశంపాయనుడి ఫోటో, జీవిత వివరాలతో, యితర రచనలతో బాటు యీవార్త ప్రముఖంగా మొదటి పేజీలోనే ప్రచురించబడి వుంది.

'హారి పిడుగా' అనుకుంటూ, అతని ఫోన్ నెంబర్ వెతికి, నంబర్ డయల్ చేసేను.

ఇంట్లోనే వున్నాడు. అతనే అందుకున్నాడు.

''నమస్కారం. నేను రంగనాధాన్ని వార్త చూసేను. కంగ్రాచ్యులేషన్సు'' అన్నాను.

'' ఓ. నువ్వా! థాంక్యూ'' ఇన్నాళ్ళకు నేను పడ్డ శ్రమకి గుర్తింపు వచ్చింది అదే చాలు. డబ్బో లెక్కలోది కాదు'' అన్నాడు.

''అదేమిటోయి అట్లా అంటావు. 1116 అంటే అంత తీసిపారేసే మొత్తమా? అది కూడా చంద్రుడికో నూలు పోగు అన్నట్లు ఇచ్చి వుంటారు అనుకుంటా'' అన్నాను ఏమనాలో తోచక.

''ఈ వ్యాసాలను పత్రికకు ఇస్తేనే నాకు 1000 రూపాయిలు వచ్చేయి. పుస్తకంగా ప్రచురించినందుకు ప్రచురణ కర్తలు 2000 వరకు ఇచ్చేరు. నేను యీ వ్యాసాలు రాయడం కోసం మహా ఖర్చు పెడితే 300 ఖర్చు అయివుండొచ్చును. అందులో కూడా ఆ బీదా బిక్కికి కాఫీ, చా, సిగరెట్లకి, నల్లమందుకి దాదాపు 100 రూపాయిలు ఖర్చుచేసి వుంటానేమో. మిగతాది నా ఆటో ఛార్జీలకి, ఫోటోగ్రాఫర్ ఖర్చులకి అయ్యి వుంటాయి..అంచేత ఆ సంస్థ యిచ్చే 1116 నాకంత లెక్కలోకి రాదు. గుర్తింపు వచ్చింది చూడు— అది ముఖ్యం. ఇంతకూ నేనిచ్చిన పుస్తకం చదివేవా? ఎట్లా వుంది?'' అన్నాడు ఆదుర్దాగా.

''తీసుకున్న సబ్జక్టు బాగానే వున్నాయి గాని వాటిని చెప్పడంలో యింకొంచెం వైవిధ్యం, చాతుర్యం ప్రదర్శించి వుంటే బాగుండి వుండేదేమో'' అన్నాను.

''ఇంతమంది విమర్శకులు ఏమేమో వ్రాసేరుగాని ఒక్కడూ నీలాగ కుండ పగలకొట్టినట్టు నా లోపాన్ని ఎత్తి చూపలేదు. నువ్వంటే అందుకే నా కిష్టం. 'సీసీ హా థాంక్యు ఫర్ ది సజెషన్'. అయినా ఆ పత్రిక వాడిచ్చిన 1000 రూపాయిలకి నేను వాడిన భాష, శైలీ చాలు.

లేరా ఏమంటావు?'' అతను చేసిన 'రా' ప్రయోగానికి నక్క క్షణం దిమ్మరపోయేను. ఏ చెప్పాలో తోచక నీళ్ళు నమిలేను.

''ఒరేయి నేను ఒకటి చెబుతాను విను. ఆ రోజుల్లో సాహిత్యపు విలువలు అంటూ తలకాయలు పగలకొట్టుకుని, అచి తూచి రచనలు చేస్తే ఎవ్వడూ పట్టించుకోడు. సామాన్యుల మాట వదిలెయ్యి. ఏదీ ఆ సాహిత్యపు గద్దెల మీద వున్న వాళ్ళే! దీని కంతా కావలసింది స్పీడ్. మరింకా యంత్రాంగం. పోదూ... అదంతా చెప్పినా నీ కర్థం కాదులే. ఎప్పుడన్నా యిటురా, సరదాగా కూర్చుందాం ఏం?'' అన్నాడు వుత్సాహంగా.

''ఓ అట్లాగే'' అంటూ ఫోన్ను పెట్టేసేను. 'కూర్చుందాం' అని అతనన్న మాటను గూర్చి ఆలోచిస్తోంటో వైశంపాయనుడు ఎంత ఎత్తుకి ఎదిగి పోయేడో అర్థం అయిపోయింది. ఇంకా ఎంత ఎత్తుకి ఎదిగి పోగలడో కూడా వూహించుకునేసరికి వణకుపుట్టింది.

మా పిల్లలకు కాలేజీ సీట్లు, వుద్యోగాలు సంపాదించడం వగైరా యీతి బాధల్లో అర్నెల్లపాటు వార పత్రికలు, దిన పత్రికలు గాని సరిగా చూడడం పడింది కాదు. శ్లేష్మంలో పడ్డ ఈగ లాగ పడికొట్టుకుని, కొట్టుకుని తేరుకుంటూ వుండగా ఒకనాడు వుద యాన్నే మాయింటి ముందు ఒక కారు వచ్చి ఆగింది. పిల్లలంతా 'నాన్నా, కారు—కారు' అంటూ బయటకు పరుగెత్తేరు. ఎలక్షన్ల టైం కూడా కాదు, నాకోసం కారులో ఎవరు వస్తారా అని కిటికీలో నుంచి బయటుకు చూస్తూండగానే, నోటిలో పైపుతో, దర్జాగా దిగేడు వైశంపాయనుడు.

''ఏమోయి కుశలమేనా? బహు కాలానికి దర్శనం యిచ్చేవు'' అన్నాను. 'అమ్మమ్మ! అంత మాట అనకు. బహుకాలానికి దర్శనం చేసుకున్నావు అను' అన్నాడు దర్జాగా కూర్చుంటూనే.

''ఏమిటి విశేషాలు?'' అన్నాను.

''ఏమీ లేదుగానీ, నీకో సన్మానం చేయిస్తాను. నీకు ఎప్పుడు వీలవుతుంది?'' అన్నాడు సీరియస్‌గా. నేను షాక్ అయిపోయేను. నాకు సన్మానమా! 'బాబ్బాబు, అంతపని మాత్రం చెయ్యకు. నీకు పుణ్యం వుంటుంది. నన్ను వదిలేయి ఇంకెవరినన్నా పట్టుకో. నన్నిలా బతకనీ' అన్నాను బతిమాల్తూ.

''నీకు బాగుపడటం చేత కాదురా! నూతిలో కప్పలా నువ్వూ, నీ ఆఫీసూ, పెళ్ళాం, బిడ్డలూ తప్ప లోకం ఏమవుతోందో, ఎట్లాంటి మార్పులు జరుగుతున్నాయో నువ్వు పట్టించుకోవు. ఈ రోజుల్లో సాహిత్యానికి కావలసినంత ప్రోత్సాహముందోయి. కొంచె చొరవ చేసుకుని నలుగురితోనూ తిరగాలి. ఇదర్ని పొగిడి, వల్లిరి చేత పొగడించు కోవాలి. మంచో చెడో, సెక్సో, క్రైమో, ఏదోకటి విపరీతంగా టన్నుల కొద్దీ రాయాలి. దానికి తగిన ప్రచారం చేసుకోవాలి, చేయించుకోవాలి. అప్పుడే తగిన గుర్తింపు బహు మతులు వగైరాలన్నీ వచ్చిపడతాయి. సంవత్సరానికి ఒక మంచి కథ రాస్తే ఏం లాభం? ఎవరు మెచ్చుకోరు? అయినా నీ ముందు ఎంత వాగితే ఏం లాభం! నీకు ఎదగడం అసలు ఇష్టం లేదు. ఏం చేస్తాం — కానీ''.

''అది సరే! ఏమిటీ పని మీద వచ్చినట్లున్నావ్?'' అన్నాను అతని ధోరణి తప్పించాలని.

''అవునోయి, ఈ నెల యిరవయ్యో తేదీన నేను ఢిల్లీలో వుండాలి. ఒక ఫస్టు క్లాసు కూపే రెండు బెర్తులది రిజర్వు చేయించి పెట్టాలి. ఈ సారి మా శ్రీమతి కూడా బహుమతి ప్రదానోత్సవం చూస్తుందిట'' అన్నాను.

''బహుమతి ప్రదానోత్సవం ఏమిటోయి? ఎవరికి? ఎందుకు?'' అన్నాను అర్థ కాక.

''సరిలే. నువ్వు యీలోకంలో వున్నట్లు లేవు. ఈ సంవత్సరం బహుమతి యీ వైశంపాయనుడికి ఇవ్వాలని కేంద్రం నిర్ణయించుకుంది. దాన్ని ఎవరో ప్రముఖ వ్యక్తి ఢిల్లీలో మనకు 20 వ తేదీన అంద చేస్తారు'' అన్నాడు మెరుస్తున్న కళ్ళతో.

''సంపేసేవు. నాకు తెలియదే, కంగ్రాట్యులేషన్సు! ఇంతకూ డబ్బేమైనా వుంటుందా, లేక కాగితంముక్కా, దుశ్శాలువాయేనా?''

'' ఆ మూడూ వుంటాయి. డబ్బంటే ఏదో పదివేల వరకూ వుంటుందిలే!''

''ఏమిటీ? పదివేలే! రచయితకే!'' అన్నాను ఆశ్చర్యంగా.

''అవును, రచయితకే, పదివేలు వక లెక్కేమిటోయి! జ్ఞానపీఠ్ అవార్డుకి ఎంత వస్తుందో తెలుసా? లక్ష రూపాయిలు!''

''నాయనా నువ్వు చాలా ఎదిగి పోయేవు. నువ్వు చేసే సేవకి ఓ నాడు అజ్ఞాన పీఠం అవార్డు వచ్చినా నేను ఆశ్చర్యపోను'' అన్నాను.

'' దానికి ఇంకా చాలా టైం వుంది. చాలా శ్రమ పడాలి. అది సరేగాని, నా రిజర్వేషన్ సంగతి ఏమిటి? అవుతుందా?''

''ఓ! తప్పక రేపే మా ఆఫీసర్‌తో మాట్లాడి చేయించి పెడతాను. అయితే చిన్న సందేహం! ఈ వచ్చే 10 వేలు ఏం చెయ్యదల్చుకున్నావ్?'' అన్నాను కుతూహలంగా.

''అబ్బాయి, నీ దయవల్ల నాకు తిండికి లోటు లేదు. సాహిత్యం మీదే నెల నెలా బోలెడు రాయల్టీస్ వస్తున్నాయి. పిల్లలందరికీ మంచి వుద్యోగాలు దొరికేయి. అమ్మాయిల పెళ్ళిళ్ళు చేసేసేను. చిన్న ఇల్లు కూడా కట్టించు కున్నాను. అందుచేత యీ డబ్బుతో ఓ సత్కార్యం చేద్దామని వుంది. శాశ్వతంగా నిల్చిపోయే, సత్కార్యం'' అన్నాడు.

''నేనో సలహా యివ్వనా?'' అన్నాను... కొంచెం తటపటాయించి.


''అవశ్యం'' అన్నాడు కళ్ళు మూసుకుని పైపును పీలుస్తూ.

''శాశ్వతమో, అశాశ్వతమో నాకు తెలియదు గాని సత్కార్యం మాత్రం అవుతుంది.''

''చెప్పు అనుమానించక'' అన్నాడు నిమీలిత నేత్రాల్తో చూస్తూ.

''ఈ పదివేలు కాక యింకో ఆరు వేల వరకు నువ్వు బడుగు జీవుల మీద రాసిన వ్యాసాలకయితేనేం, పుస్తకానికయితేనేం ప్రతిఫలంగాను, బహుమతుల రూపంలోను నీకు ముడుతోంది కదా, కనీసం యిందులో ఒక అయిదు వేలన్నా వేరే అట్టే పెట్టి, ఆ బడుగు జీవుల్లో అయిదుగుర్ని ఎన్నుకుని వక్కొక్కరికి వకో వెయ్యి యిస్తే, వాళ్ళు బాగుపడి సంతోషిస్తారు. నీకూ ఒక మంచి పని చేసిన ఆత్మానందం కూడా లభిస్తుంది. ఏమంటావు?''

''ఒరేయి. నువ్వు ఒట్టి పిచ్చి నాలోకానివి. వాళ్ళకు ఒక్కసారిన వెయ్యి రూపాయలిస్తే శుభ్రంగా తాగేసో, పేకాట ఆడో, ముండల్ని మరిగో డబ్బుకి హారతి యిచ్చేయ్యడమే కాకుండా, వాళ్ళు నాశనమయిపోతారు.



వాళ్ళని నేను కాచి వడపోసేను."

"మరయితే ఏం చేద్దామనుకుంటున్నావు?"

"నేను అట్టే చదువుకోలేదు కదా! అందుచేత నలుగురికే చవకగా విద్యా దానం చేద్దామనుకుంటున్నాను? మా శ్రీమతి, మా బావమరిదీ కూడా యీ వుద్దేశం భేషుగా వుందన్నారు. కనక మా కాలనీలోనే ఓ కాన్వేంటు స్కూలును తెరిపిద్దామనుకుంటున్నాను."

"కాన్వేంటా"?


"అవును, మా బావమరిది బి.ఏ.ప్యాసయి నా దగ్గరే వూరికే వుంటున్నాడు. వాడిని హెడ్మాష్టర్‌గా వేస్తే, మా కాలనీ వాళ్ళకీ వుపకారం చేసినట్లు వుంటుంది. మా వాడికీ, మరి కొందరికీ నిరుద్యోగ సమస్య తీరుతుంది. అయితే తక్కువ జీతాలు వసూలు చేస్తాం పిల్లల వద్దనుంచి."

"చాలా బావుందోయి" అన్నాను. అతని తెలివికి విస్తుపోయి.

"మా పిల్లలు కూడా ఆ స్కూలుకి నా పేరే పెట్టమంటున్నారు. వాళ్ళ మనస్సుని నొప్పించడం ఇష్టం లేక 'సరే' అనాల్సి వస్తోందోయి."

నా నోట మాట లేక నిశ్చేష్టుడినయి, వామనుడిలాగ ముల్లోకాలు వ్యాపించిపోతున్న వైశంపాయనుడి వంకే చూడసాగేను.

"మరి వస్తానోయి! నా రిజర్వేషన్ సంగతి మరిచి పోకేం? దొరక్కపోతే చాలా అభాసయి పోతుంది.




చూడు, ఆలోచించిచూడు— సన్మానం చేయించుకునే సంగతి. ఎప్పుడైనా చేయిస్తాను నువ్వు 'ఊ' అంటే!" అంటూ బూట్లు టకటక లాడించుకుంటూ బయటకు వెళ్ళి కారులో కూర్చుని 'టాక్' మని పెద్ద శబ్దంతో కారు తలుపును మూసి, దుమ్ములేపుకుంటూ వెళ్ళి పోయేడు ఎంతో ఎత్తుకు 'ఎదిగి పోయిన' మనిషి!

నేను అల్లాగేగుమ్మం వద్ద చేష్టలుడిగిన బొమ్మలాగ నిలబడి పోయేను... వైశంపాయనుడి లేపిన దుమ్ములోకి చూస్తూ.


వేలాది కుటుంబాలు అనాదిగా వాడి చూడబడిన
**లవంగనూనె**
సద్గుణాలనిప్పుడు
**ప్రామిస్**
వాడి పొందగలుగుతున్నారు. మీరూ ఎందుకు వాడరాదు!




**ప్రామిస్**
- దంతక్షయం నుండి రక్షణకు తోడ్పడుతుంది.
- నోటిని తాజాగా రూపొందిస్తుంది.
- దుర్వాసనను అరికడుతుంది.

అంతర్జాతీయ స్వర్ణపతక విజేతలు

ఆరోగ్యంచిందే పళ్ళు, చిగుళ్ళు, తాజాశ్వాస.

3 బల్సారా ఉత్పాదన

CHAITRA-BLS-668 TEL